# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 02 ఆగస్టు 2025 | www.balagamtv.com | పేజీలు 4


# కేటీఆర్, జగదీష్ రెడ్డిలకు హైకోర్టులో ఊరట

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఫేక్ వీడియోలు సృష్టించి ప్రచారం చేశారంటూ నమోదైన కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారకరామారావు (కేటీఆర్), మాజీ మంత్రి జగదీష్ రెడ్డిలకు హైకోర్టు భారీ ఊరటను ఇచ్చింది. చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఫిర్యాదుతో మేడిపల్లి పోలీసులు అప్పట్లో ఈ ఇద్దరిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్, జగదీష్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై శుక్రవారంవిచారణ చేపట్టిన ధర్మాసనం కేటీఆర్, జగదీష్ రెడ్డిపై నమోదైన కేసును కొట్టివేసింది. పోలీసులు తప్పుడు సెక్షన్లు నమోదు చేశారని, పోలీసులు నమోదు చేసిన సెక్షన్లకు ఎలాంటి ఆధారాలు లేవని కెటిఆర్, జగదీశ్వర రెడ్డి తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. సుదీర్ఘ విచారణ అనంతరం ఫేక్ వీడియోలపై ఎలాంటి ఆధారాలు లేవని కేసును కొట్టివేస్తూ ధర్మాసనం తీర్పు వెలువరించింది.

# 71వ జాతీయ చలనచిత్ర అవార్డులు ప్రకటన

- ఉత్తమ జాతీయ చిత్రం 12th ఫెయిల్'
- ఉత్తమ తెలుగు చిత్రంగా భగవంత్ కేసరి ఎంపిక

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిష్టాత్మక జాతీయ చలనచిత్ర పురస్కారాల 71వ సంక్షోభాన్ని కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. డైరెక్టరేట్ ఆఫ్ ఫిల్మ్ ఫెస్టివల్స్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహించే ఈ అవార్డులను రాష్ట్రపతి చేతుల మీదుగా విజయులకు అందజేస్తారు. 2023 సంవత్సరానికి గాను వివిధ విభాగాల్లో అవార్డులను ఖరారు చేస్తూ జ్యూరీ కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, ఎల్ మురుగన్‌లకు నివేదించింది.

ఈ ఏడాది జాతీయ ఉత్తమ చిత్రంగా '12th ఫెయిల్' ఎంపిక కాగా, ఉత్తమ నటుడిగా షారూఖ్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మస్సే (12th ఫెయిల్) లు ఎంపికయ్యారు. ఉత్తమ నటి అవార్డును రాణీ ముఖర్జీ (మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే) గెలుచుకున్నారు. ఉత్తమ దర్శకుడిగా సుదీప్తో సేన్ (ది కేరళ స్టోరీ) ఎంపికయ్యారు.

తెలుగు సినిమాల విభాగంలో ప్రముఖ నటుడు బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి' ఉత్తమ తెలుగు చిత్రం అవార్డును గెలుచుకుంది. హనుమాన్ చిత్రానికి 'బెస్ట్ స్టంట్ కొరియోగ్రఫీ' అవార్డు లభించగా, నందు-పృథ్వీలకు ఉత్తమ యాక్షన్ డైరెక్టర్ గా గుర్తింపు లభించింది.

సాయి రాజేష్ దర్శకత్వం వహించిన 'బేబీ' సినిమాకు ఉత్తమ స్క్రీన్ ప్లే (షేరింగ్) అవార్డు దక్కగా, అదే చిత్రానికి పివి ఎన్ఎస్ రోహిత్ ఉత్తమ గాయకుడిగా ఎంపికయ్యారు. 'బలగం' చిత్రంలోని "ఊరు పల్లెటూరు" పాటకు ఉత్తమ గీత రచయితగా కాసర్ల శ్యామ్ అవార్డు పొందారు. సుకుమార్ కుమార్తె సుకృతి వేణి 'గాంధీ తాత చెట్టు' సినిమాలోని పాత్రకు ఉత్తమ బాల నటిగా ఎంపికైంది. హనుమాన్ చిత్రానికి యానిమేషన్-విఎఫ్ఎక్స్ విభాగంలో అవార్డు లభించింది.

**నాన్ ఫీచర్ విభాగం విజేతలు:**


ఉత్తమ డాక్యుమెంటరీ: గాడ్ వల్చర్ అండ్ హ్యూమన్
ఉత్తమ స్క్రిప్ట్: సన్‌ఫ్లవర్స్ వర్ ది ఫస్ట్ వన్స్ టు నో (కన్నడ)
ఉత్తమ నరేషన్: ది స్కేడ్ జాక్ %-% ది ట్రీ ఆఫ్ విశెస్
ఉత్తమ మ్యూజిక్ డైరెక్టర్: ది ఫస్ట్ ఫిల్మ్
ఉత్తమ ఎడిటింగ్: మూవింగ్ ఫోకస్
ఉత్తమ సౌండ్ డిజైన్: దుందగిరి కే పూల్
ఉత్తమ సినిమాటోగ్రఫీ: లిటిల్ వింగ్స్ (తమిళం)
ఉత్తమ దర్శకుడు (నాన్ ఫీచర్): పీయూష్ ఠాకూర్ %-% ది ఫస్ట్ ఫిల్మ్

**స్పెషల్ మెన్షన్స్:**

నేకల్ (మలయాళం), ది సీ అండ్ సెవెన్ విలేజెస్ (ఒడియా), ఉత్తమ విమర్శకుడిగా అసామీ భాషలో రచయిత ఉత్పల్ దత్త

ఇతర భాషల విజేతలు:
ఉత్తమ తమిళ చిత్రం: పార్కింగ్
ఉత్తమ గారో చిత్రం: రిమ్డోగిట్టంగా

ఉత్తమ తాయ్ ఫేక్ చిత్రం: పై టాంగ్







ఉత్తమ బెంగాలీ చిత్రం: డీప్ ఫ్రిడ్జ్
ఉత్తమ గుజరాతీ చిత్రం: వష్
ఉత్తమ హిందీ చిత్రం: కథల్
ఉత్తమ కన్నడ చిత్రం: కందీలు
ఉత్తమ మేకప్: సామ్ బహదూర్
ఉత్తమ సంగీతం: వాతి, యానిమల్ %-% జివి ప్రకాష్, హర్షవర్ధన్
ఉత్తమ కొరియోగ్రఫీ: ధింఢోరా బజే రె (రాకీ ఔర్ రాణీ...)

ఈ ఏడాది పలు ప్రాంతీయ చిత్రాలు జాతీయ స్థాయిలో మెరిశాయి. నూతనుల ప్రతిభకు గౌరవం లభించగా, అనుభవజ్ఞుల కృషికి సముచిత గుర్తింపు దక్కింది. త్వరలో ఢిల్లీలో జరగబోయే అవార్డు ప్రదానోత్సవంలో రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాలు అందజేయనున్నారు.

## కాళేశ్వరం నివేదిక
# అధ్యాయనానికి కమిటీ



- కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికను సీఎం రేవంత్‌కు సమర్పించిన అధికారులు
- జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ నివేదికపై కమిటీ అధ్యయనం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి న్యాయ విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ సమర్పిం చిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వాధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు నల్లా ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గార్లు సీఎం సమక్షంలో నివేదికను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమార రామకృష్ణారావు, నీటి పారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, జీఏడీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ నివేదికను సీఎం గారికి అందజేశారు.

కమిషన్ నివేదికను సమగ్రంగా అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. ఈ కమిటీకి నీటి పారుదల, న్యాయ, జీఏడీ శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉన్నారు.

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ఈ కమిటీ సమగ్రంగా విశ్లేషించి, తుది సారాంశాన్ని ఈ నెల 4న రాష్ట్ర మంత్రిమండలికి సమర్పించనుంది.

# మా దగ్గర అణుబాంబ్ లాంటి ఆధారాలున్నాయి



- ఈసీపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఫైర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

భారత ఎన్నికల సంఘం (ఈసీ)పై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ ప్రయోజనాల కోసం ఓట్ల చౌర్యానికి ఈసీ పాల్పడుతోందని, ఆ ఆరోపణలను రుజువు చేసే ఆధారాలు తమ వద్ద లిలి"అణుబాంబ్ లాంటి"లిలివున్నాయని హుద్దగా ప్రకటించారు.

బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై రాహుల్ గాంధీ వ్యతిరేకత వ్యక్తం చేశారు. తాజాగా విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితాపై స్పందిస్తూ, రాష్ట్ర స్థాయినుంచి ఓట్ల చౌర్యం సాగుతోందని గత కొంతకాలంగా తాము అనుమానిస్తున్నామని తెలిపారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే తరహా అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కొత్తగా కోట్లాదిమంది ఓటర్లను అనధికారంగా జాబితాల్లో చేర్చినట్లు తమ పరిశీలనలో తేలిందని పేర్కొన్నారు. ఆరు నెలల పాటు పార్టీ నేతలతో కలిసి స్వతంత్రంగా పరిశోధనలు నిర్వహించామనీ, దాంతో ఈసీ పాత్ర బయటపడిందని వివరించారు.

**"ఆటమ్ బాంబ్ పేలిన రోజు, ఈసీ దాక్కునే చోటు ఉండదు"**

పండుగ పేలుడ్ల కంటే భారీగా ఉండే "ఆటమ్ బాంబ్" ఆధారాలు తమ వద్ద ఉన్నాయి అని రాహుల్ గాంధీ చెబుతూ, అవి బయటపెట్టిన తర్వాత ఈసీ దాక్కునే స్థలం కూడా ఉండదని హెచ్చరించారు. బీజేపీ ప్రయోజనాల కోసం ఎన్నికల సంఘం పని చేస్తోందంటే, అది దేశద్రోహం కంటే తక్కువ కాదని ఘాటుగా విమర్శించారు. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా పనిచేస్తున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని, వారు రిటైర్ అయినా, ఎక్కడ దాక్కున్నా పట్టుకుంటామని హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను భద్రంగా ఉంచడం తమ బాధ్యతగా పేర్కొన్నారు.

# 10వ రోజూ ఆందోళనలే...


- బీహార్‌లో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై పార్లమెంటులో ఆందోళన
- మూడు బిల్లులు ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమై పది రోజులైనా లోక్‌సభలో ఆందోళనలు తగ్గలేదు. బీహార్‌లో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీల ఎంపీలు సభాపరిధిలో నిరసనకు దిగారు. శుక్రవారం సభ ప్రారంభమైన కొద్ది సమయానికే ప్రతిపక్షాల నినాదాలతో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ ఓం బిర్లా సభను మొదట మధ్యాహ్నం 12 గంటల వరకు, అనంతరం 2 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి ప్రారంభమైనా ఒకే విధంగా ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగడంతో స్పీకర్ చివరకు సభను సోమవారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేశారు.

**ప్రత్యేక చర్చపై డిమాండ్**

ప్రతిపక్ష సభ్యులు బీహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక చర్చ చేపట్టాలని కోరుతూ నినాదాలు చేశారు. వారు చేస్తున్న ఆరోపణల ప్రకారం, ఓట్ల చౌర్యానికి పాల్పడటానికి ఈ చర్యల్ని బీజేపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. చర్చ లేకుండానే మూడు కీలక బిల్లుల ప్రవేశం ఇదిలా ఉండగా, ఇలాంటి అసహజ పరిస్థితుల మధ్య కూడా కేంద్ర ప్రభుత్వం మూడు కీలక



బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అవే:

షెడ్యూల్డ్ ట్రైబ్స్ రిజర్వేషన్లకు సంబంధించిన 'గోవా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రాతినిధ్యం బిల్లు - 2024'
'ఇండియన్ పోర్ట్స్ బిల్లు - 2025'
'మర్చంట్ షిప్పింగ్ బిల్లు -2024'

ఇలా ఆందోళనల నడుమ సర్వసాధారణ చర్చలు జరగకపోయినా కేంద్ర ప్రభుత్వం తన శాసనపరమైన కార్యక్రమాలను కొనసాగిస్తోంది. ప్రతిపక్షాల హంగామా కొనసాగితే రాబోయే రోజుల్లో సమావేశాల సాగుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# తెలంగాణ విద్యుత్ సామర్థ్యంలో మైలురాయి

- జనవరి 26 నాటికి అందుబాటులోకి 4000 మెగావాట్ల విద్యుత్
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

4000 మెగావాట్ల సామర్థ్యం గల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను వచ్చే జనవరి నాటికి పూర్తిగా జాతికి అంకితం చేయనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా 800 మెగావాట్ల తొలి యూనిట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన తెలంగాణలో విద్యుత్ అవసరాలపై చారిత్రాత్మక మైలురాయిగా పేర్కొన్నారు.

**పర్యావరణ అనుమతులలతోనే జాప్యం**

భట్టి వెల్లడించిన వివరాల ప్రకారం, గత ప్రభుత్వం బీఆర్ఎస్ హయాంలో పర్యావరణ అనుమతులలో జాప్యం కారణంగా ప్రాజెక్టు రెండేళ్ల పాటు వాయిదా పడింది. దీనివల్ల ఖర్చులు భారీగా పెరిగాయని తెలిపారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే అవసరమైన అనుమతులు సాధించగలిగిందని పేర్కొన్నారు. ఇప్పటికే రెండు యూనిట్లు కలిపి 1600 మెగావాట్లు దేశానికి అంకితం చేసినట్లు వెల్లడించారు. ప్రాజెక్టు వేగంగా పూర్తి కావడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరుల సహకారం ఎంతో కీలకంగా నిలిచిందని తెలిపారు.

యాదాద్రి మరియు పులిచింతల ప్రాజెక్టుల కోసం భూములు సమర్పించిన ప్రతి ఒక్కరికి ఈ నెల 15 లోగా ఉద్యోగాలు కల్పించనున్నట్లు భరోసా ఇచ్చారు.



ప్యాకేజీ పూర్తిగా అమలవుతుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఉద్యోగ హామీలను నెరవేర్చలేదని విమర్శించారు.

ఉద్యోగులకు కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రాంతీయ ప్రజలకు కూడా ఉచిత విద్యా, ఆరోగ్య సేవలు అందించనున్నట్లు ప్రకటించారు. అంబులెన్స్‌లు సమీప నియోజకవర్గాలకు కేటాయిస్తామని, వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రత్యక్ష లాభాలు కలిగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బరువైన వాహనాల రాకపోకల వల్ల రోడ్లు దెబ్బతినడంతో ప్రజలు చేసిన ఫిర్యాదులపై స్పందించిన భట్టి, ఇప్పటికే అనేక సీసీ రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయని, పనులు జరుగుతున్నాయన్నారు.

## పత్రికలు
# ప్రజల పక్షాన నిలవాలి



- సీఎం రేవంత్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

"స్వాతంత్ర్య సమర కాలంలో పత్రికలు ప్రజల్లో స్ఫూర్తిని నింపి ఉద్యమాన్ని ఒక వేదికపైకి తీసుకువచ్చాయి. ఇప్పుడు కొన్ని వింత పోకడలు పాత్రికేయ రంగానికి ప్రమాదకరంగా మారుతు న్నాయి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

కమ్యూనిస్టుల ఆధ్వర్యంలోని పత్రికలు గతంలో ప్రజల పక్షాన నిలబడి చైతన్యాన్ని వ్యాప్తి చేశాయని గుర్తుచేశారు. సాయుధ రైతాంగ పోరాటం, బాల్యవివాహాలు, కుల భేదాలు, జోగినీ వ్యవస్థ వంటి అనేక సామాజిక రుగ్మతలపై అవగాహన కలిగించడంలో పత్రికల పాత్ర గౌరవనీయమని ప్రశంసించారు.

ఇప్పుడేమైందంటే... కొన్ని మీడియా సంస్థలు రాజకీయ పార్టీల చేతిలో ఆయుధాలుగా మారి, తమ స్వప్రయోజనాల కోసం జర్నలిజాన్ని తాత్కాలిక లాభాల కోసం త్యాగం చేస్తున్నాయి. కొన్ని సంస్థలు అసహ్యకర భాషను ఉపయోగించి ప్రత్యర్థులను దూషిస్తున్నాయనీ, జర్నలిస్టు అనే పదానికి అర్థం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీల తరఫున ముందుకు వచ్చే వ్యక్తులు జర్నలిస్టుల ముసుగులో దాగి పనిచేస్తే, అసలైన జర్నలిస్టులు స్పందించాల్సిన అవసరం ఉంది. నిబద్ధత గల పాత్రికేయులు, ఈ పరిస్థితిని ఎదుర్కొనడానికి సదస్సులు, చర్చలు నిర్వహించి, జర్నలిజం పరిమితులు ఏమిటో సమాజానికి తెలియజేయాలని సీఎం సూచించారు.

"నిజమైన పాత్రికేయులకు, రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేసేవారికి మధ్య లక్ష్మణ రేఖ ఉండాల్సిన అవసరం ఉంది. ఇది పాటించకపోతే పత్రికలే కాదు, దేశ భద్రతకూ ప్రమాదం కలుగుతుంది" అన్నారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ సందర్భంగా జర్నలిస్టు ముసుగులో విధ్వంసక చర్యలకు పాల్పడిన వారు పట్టుబడ్డ ఘటనలను ఉదాహరణగా పేర్కొన్నారు. సామాజిక స్థితిగతుల్ని అర్థం చేసుకోవడానికి, పరిపాలనలో లోటుపాట్లను గుర్తించేందుకు విశ్లేషణాత్మక కథనాలు కీలకమని తెలిపారు. "ప్రజల సమస్యలు నా దృష్టికి తెచ్చే వార్తలను నేను ఎప్పుడూ గమనిస్తుంటా" అని పేర్కొన్నారు. "అబద్ధాలపై రాజకీయ భవిష్యత్తు నిర్మించుకుంటే అది కూలిపోతుంది" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాఖ ప్రత్యేక కమిషనర్ సీహెచ్ ప్రియాంక, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, నవతెలంగాణ సాహితీ సంస్థ ఇన్‌చార్జి తమ్మినేని వీరభద్రం, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీజీఎం ప్రభాకర్, పత్రిక సంపాదకులు రాంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఉపరాష్ట్రపతి
# ఎన్నికకు షెడ్యూల్ విడుదల

- సెప్టెంబర్ 9న పోలింగ్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

నూతన ఉపరాష్ట్రపతి ఎన్నికకు శుక్రవారం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా అనంతరం ఈ ఎన్నిక అనివార్యమైంది. సెప్టెంబర్ 9న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

**ఎన్నికల ప్రణాళిక ఇలా:**

ఆగస్టు 7న: ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
ఆగస్టు 21వ తేదీ: నామినేషన్ దాఖలు గడువు చివరి రోజు
ఆగస్టు 22వ తేదీ: నామినేషన్ల పరిశీలన
ఆగస్టు 25వ తేదీ: నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ
సెప్టెంబర్ 9వ తేదీ: ఉపరాష్ట్రపతి ఎన్నిక పోలింగ్



# కుప్పకూలిన ఇంగ్లండ్ జట్టు

- తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 247 పరుగులకు ఆలౌట్
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 75-2

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదో టెస్టులో భారత్ బౌలింగ్‌లో దుమ్మురేపింది. మహమ్మద్ సిరాజ్ (4/86), ప్రసిధ్ కృష్ణ (4/62) నాలుగేసి వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను కట్టడి చేశారు. ఫలితంగా ఇంగ్లండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 51.2 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌటైంది. జాక్ క్రాలీ (64), హ్యారీ బ్రూక్ (53), బెన్ డకెట్ (43) మాత్రమే మెరిశారు. తీవ్ర గాయంతో క్రిస్ వోక్స్ బ్యాటింగ్‌కు దిగలేదు. అనంతరం భారత్ రెండో రోజు ముగిసే సమయానికి 2 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది.

ఇంగ్లండ్ ఓపెనర్లు డకెట్, క్రాలీ బాజ్ బాల్ ధోరణితో చెలరేగారు. 92 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. అయితే, ఆకాష్ దీప్ డకెట్‌ను ఔట్ చేయడంతో భారత్‌కు బ్రేక్ దొరికింది. తర్వాత సిరాజ్, ప్రసిధ్ కృష్ణల మాయ బౌలింగ్‌తో ఇంగ్లండ్‌ను భారత్ కట్టడి చేసింది. రెండో సెషన్‌లో సిరాజ్ విరుచుకుపడి కీలకమైన జోరూట్ (22), జాకోబ్ బెతెల్ (6) ను పెవిలియన్ చేర్చాడు.ఆఖరి సెషన్‌లో హ్యారీ బ్రూక్ ఒంటరిగా పోరాడాడు. 57 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసి మంచి జోరు చూపించాడు. అతనికి తోడుగా అట్కిన్సన్ (14) ప్రయత్నించినా ప్రసిధ్ కృష్ణ మళ్ళీ భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. చివరికి బ్రూక్‌ను సిరాజ్ క్లీన్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ ముగిసింది.

# తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణకు కట్టుబడున్న బీఆర్ఎస్

- **మాజీ మంత్రి హరీశ్ రావు**

**బలగం టీవీ, హైదరాబాద్**

బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుల మధ్య లోపాయికారి ఒప్పందం జరిగిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్న రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.




ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ, బనకచర్ల ప్రాజెక్టు కట్టి తీరుతామని లోకేష్ ఢిల్లీలో పవర్ ఉంది కాబట్టి ధైర్యంగా చెబుతున్నారు. మరి తెలంగాణ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు, సీఎం, మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదు? మీరు లోపాయికార ఒప్పందం చేసుకున్నారు. మీ చీఫ్ సెక్రటరీ బనకచర్ల అంశం మీద చర్చకు రాము అని రాస్తే, రేవంత్ రెడ్డి మాత్రం బనకచర్ల అంశం ఉన్నప్పటికీ పాల్గొని, కమిటీ వేసేందుకు ఒప్పుకొని వస్తాడు. ఇది మీ ధైర్యం చూసుకొనే లోకేష్ బనకచర్ల కట్టి తీరుతాం అంటున్నారని అన్నారు.

"బనకచర్లపై చంద్రబాబు బుల్డోజ్ విధానానికి బీజేపీ, కాంగ్రెస్‌ల మౌనమే కారణం. వారి సహకారం వల్లనే అంత ధైర్యంగా ప్రకటిస్తున్నారు. లోకేష్ ప్రాజెక్టు కట్టి తీరుతం అంటే, రేవంత్ రెడ్డి మాత్రం బనకచర్ల కడుతలేరు, ఎజెండాలో లేదు, కడుతం అంటే కదా అడ్డు చెప్పేది అంటున్నాడు. రేవంత్ రెడ్డి గురుదక్షిణ చల్లించుకునే పనిలో పడ్డాడు. రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్, బీజేపీ 'డూడూ బసవన్న' లాగా తలూపుతున్నారు. అందుకే ధైర్యంగా మాట్లాడుతున్నారు. రేవంత్ గురుదక్షిణలో భాగంగా చంద్రబాబు మెప్పు కోసం, ఢిల్లీ మెప్పు కోసం ప్రయత్నం చేస్తాడు తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదు" అని హరీశ్ రావు విమర్శించారు.

"లోకేష్ అవగాహన లేకుండా మాట్లాడాడు. అధికారం ఉందని, మంద బలం ఉందని మాట్లాడటం పొరపాటు. మిగులు జలాలు అనేవి నిజంగా ఉంటే కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఎందుకు మీ డీపీఆర్ ను వెనక్కి తిప్పి పంపాయి? పోలవరం అథారిటీ, గోదావరి బోర్డు, సీడబ్ల్యూసీ, ఎన్విరాన్‌మెంట్ సంస్థలు ఎందుకు బనకచర్ల డీపీఆర్ ను తిరస్కరించాయి? నాలుగు కేంద్ర సంస్థలు బనకచర్లను తిప్పి పంపింది నిజం కాదా? మిగులు జలాలు ఉన్నాయని ఎవరు చెప్పారు? ఉంటే ఏపీకి ఎన్ని, తెలంగాణకు ఎన్ని కేటాయించారో చెప్పు?" అని ప్రశ్నించారు.

కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని స్పష్టం చేస్తూ, "కాళేశ్వరం అనేది కొత్త ప్రాజెక్టు కాదు, ప్రాణహితలో అంతర్భాగం, అందుకే ఏపీ రీఆర్గనైజేషన్ యాక్ట్ వర్తించదు అని స్పష్టంగా కేంద్రం పేర్కొన్నది. కాళేశ్వరానికి అవసరమైన 11 రకాల అనుమతులు తీసుకున్నాం. కాళేశ్వరం మీద కుట్ర చేసి, మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోయకుండా, నీళ్లు ఏపీకి పోవాలి అనే కుట్ర చేస్తున్నట్లుంది. ఏపీలో అక్రమ ప్రాజెక్టులు కట్టి కృష్ణా నదిలో నీళ్లు మళ్లించినట్లు, గోదావరి నీళ్లు మళ్లించాలనేది కుట్ర. రెండు నదులను హస్తగతం చేసుకునే కుట్రలు జరుగుతున్నాయి" అని ఆందోళన వ్యక్తం చేశారు.

"ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నట్లు నీళ్లు తీసుకుపోతా అంటే చూస్తూ ఊరుకుంటామా? ఇక్కడ ఉన్నది బీఆర్ఎస్ పార్టీ, తెలంగాణ ప్రయోజనాల కోసం పదవులను గడ్డి పోచలుగా వదులుకున్నోళ్లం. మీరు కట్టితీరుతాం అంటున్నారు, మేము అడ్డుకొని తీరుతాం అంటున్నాం. మా ప్రాజెక్టులను అడ్డుకోవడం మా ఉద్దేశ్యం కాదు, మా హక్కుల గురించి మేము మాట్లాడుతున్నాం. మా వాటా మాకు ఇవ్వండి గౌరవిస్తాం, బుల్డోజ్ చేస్తం అంటే సహించేది లేదు. కేసీఆర్ కాళేశ్వరం కోసం మహారాష్ట్రకు వెళ్లి గవర్నర్, అక్కడి సీఎంను కలిశారు. మూడు సార్లు వెళ్లి ఒప్పించి, మెప్పించారు. కాళేశ్వరం కట్టారు" అని హరీశ్ రావు గుర్తు చేశారు.

లోకేష్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, "సముద్రంలో కలిసే నీళ్లు కదా అంటున్న లోకేష్.. ఉమ్మడి ఏపీ ఉన్నపుడు 968 టీఎంసీలను తెలంగాణకు వాటాగా కేటాయించారు. విభజన బిల్లు, శ్రీకృష్ణ కమిటీ అన్నింట్లో ఈ వాటా పేర్కొన్నారు. ఇందుకు లోబడి కడుతున్న ప్రాజెక్టులను ఎందుకు ఏపీ ప్రభుత్వం అడ్డుకుంటున్నది? ఉమ్మడి ఏపీలో ఇచ్చిన 968 పరిధిలో కట్టిన ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారు, మరి బనకచర్ల ఎట్లా కడుతున్నారు, ఈ ప్రాజెక్టుకు ఉన్న అనుమతులు ఏమిటి? మా నోరు కొడతాం అంటే మాకు హక్కులు లేవా, మేము ఎందుకు ఊరుకోవాలి?" అని ప్రశ్నించారు.

968 టీఎంసీలను అంగీకరించండి. దాన్ని వ్యతిరేకిస్తూ కేంద్రానికి రాసిన లేఖలను విత్ డ్రా చేసుకోండి. గోదావరిపై నిర్మించే మా ప్రాజెక్టులను వ్యతిరేకించారు. విత్ డ్రా చేసుకోండి. గోదావరి నీళ్లు కృష్ణాకు మళ్లిస్తే ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన 155 టీఎంసీలు మాకు ఇస్తామని ఒప్పుకోండి. 1480 టీఎంసీల కంటే ఎక్కువ ఉన్న నీటిని 65:35 ప్రకారం వాటా లెక్క తేల్చాలని అన్నారు."ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నారు అన్నాడు లోకేష్. గోదావరి నదిలో మా వాటా మాకు కావాలి అంటున్నడు, మిగులు జలాల లెక్క తేలాలి అంటున్నాం. ఇలా అంటే ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నాం అంటున్నడు. లోకేష్ మీ నాన్న బాబ్లీ మీద కొట్లాడారు, ఆల్ మట్టి మీద కొట్లాడారు. మీ నాన్న ఆరోజు ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టినట్లా?" అని నిలదీశారు.

"విశాఖ ఉక్కును కాపాడుకున్నం రెండు సార్లు అంటున్నడు, విశాఖ ఉక్కుకు బనకచర్లకు చాలా తేడా ఉంది. విశాఖ ఉక్కుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా మద్దతు తెలిపింది. బనకచర్లతో తెలంగాణ నీటి హక్కుల ప్రయోజనాలకు దెబ్బ పడుతున్నది. కేసీఆర్ చంద్రబాబు, జగన్‌లను కలిసి మిగులు జలాల్లో వాటా ఉపయోగించుకొని, రెండు రాష్ట్రాలకు వాడుకుందామని చెప్పారు. మీరు చేస్తున్నది బుల్డోజింగ్ రాజకీయం. తెలంగాణకు ప్రయోజనం లేకుండా ఏకపక్షంగా బనకచర్ల కడుతం అంటున్నరు. మా వాటా తేలాలి కదా, మా లెక్క తేలాలి కదా. ఒకవైపు ప్రాజెక్టులను అడ్డుకుంటారు, మరోవైపు 968 టీఎంసీలను వ్యతిరేకిస్తారు. సుప్రీం కోర్టుకు వెళ్లి అయినా సరే కేసీఆర్ గారు, బీఆర్ఎస్ తెలంగాణ హక్కులను కాపాడుతుంది. అనుమతులు తెచ్చుకునే పద్ధతి మీకు తెలిస్తే, ఆపే పద్ధతి కూడా మాకు తెలుసు. గోదావరి బనకచర్ల ద్వారా గోదావరి నీళ్లు మాత్రమే కాదు, కృష్ణా నీళ్లను కూడా తరలించుకునే కుట్ర ఉంది. ఈ విషయం చంద్రబాబు నాయుడే చెప్పిండు. నాగార్జున సాగర్ కుడి కాలువను డబుల్ చేస్తాం అన్నడు" అని హరీశ్ రావు అన్నారు. చివరగా, "8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి అడ్జర్న్‌మెంట్ మోషన్ ఇచ్చి ఎందుకు బనకచర్ల మీద నిలదీయడం లేదు? ఎంపీలు ఉన్నది ఎందుకు? తెలంగాణ హక్కులు కాలరాయడానికా, కాపాడడానికా? అవసరం అయితే సర్వోన్నత న్యాయస్థానం వెళ్తాం, హక్కులు కాపాడుకుంటాం" అని హరీశ్ రావు హెచ్చరించారు.



## ఖైరతాబాద్‌కు కేవలం 1959 రేషన్ కార్డులే ఎందుకు?

**ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్**

**బలగం టీవీ, హైదరాబాద్**

రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో, ఖైరతాబాద్ నియోజకవర్గానికి కేటాయించిన 1959 రేషన్ కార్డులకు సంబంధించి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అభినందించారు. అలాగే, కార్డులు అందుకోబోతున్న మహిళలకు శ్రావణ శుక్రవార శుభాకాంక్షలు తెలిపారు. అయితే ఖైరతాబాద్ నియోజకవర్గానికి అనుసరించి రేషన్ కార్డుల పంపిణీలో అన్యాయం జరిగిందని ఆరోపించారు. "ఖైరతాబాద్ సర్కిల్‌లో మొత్తం 22,399 దరఖాస్తులు అందినా, కేవలం 1959 కార్డులే మంజూరు చేయడం దుర్మార్గం. అదే సమయంలో బహదూర్‌పురా, కార్వాన్, జూబ్లీహిల్స్, నాంపల్లి నియోజకవర్గాలకు 5000కు పైగా కార్డులు కేటాయించారు. ఈ వ్యత్యాసానికి ప్రభుత్వం సమాధానం ఇవ్వాలి" అని శ్రవణ్ పేర్కొన్నారు.

రేషన్ కార్డుల కోసం ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారన్న అంశంపై ఇప్పటివరకు స్పష్టతలేకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. "ప్రజాపాలన కార్యక్రమం ద్వారా వచ్చిన దరఖాస్తులు ఎంత? మొత్తం సంఖ్య ఎంత? అధికారిక గణాంకాలు వెంటనే విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు."గత 10 సంవత్సరాల్లో ఒక్క కార్డూ రాలేదు" అనే వ్యాఖ్యలు వాస్తవాలకు దూరమని స్పష్టం చేశారు. 2016 నుంచి 2023 మధ్య 6.47 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. అంతేకాక 2014లో బియ్యం కేటాయింపును 4 కిలోల నుంచి 6 కిలోలకి పెంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని గుర్తు చేశారు.

## నేరాల విచారణలో శాస్త్రీయ ఆధారాలు కీలకం..

- **ఆధునిక ఫోరెన్సిక్ పద్ధతులు వినియోగించడం ద్వారా నేరాలను సమర్ధవంతంగా పరిష్కరించవచ్చు..**
- **రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, హైదరాబాద్**

నేరాల విచారణలో శాస్త్రీయ ఆధారాలు,ఆధునిక ఫోరెన్సిక్ పద్ధతుల వినియోగం కీలకమని జిల్లా ఎస్పీ తెలిపారు.నేర సంఘటన స్థలంలో ఆధారాల సేకరణ,భద్రత లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా కేసుల దర్యాప్తులో కచ్చితమైన ఫలితాలు సాధించవచ్చున్నారు.

నేర పరిశోధనలో ఆధునిక సాంకేతికత ఉపయోగం పెరుగుతున్న నేపథ్యంలో,కేసుల విచారణలో ఆధారాలను సైన్స్ పరంగా విశ్లేషించడానికి ఫోరెన్సిక్ శిక్షణ ఎంతో అవసరమని అందులో భాగంగా ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో మెడికల్ కళశాల వైద్య నిపుణుల ఆధ్వర్యంలో జిల్లాలోని ఇన్వెస్టిగేషన్ అధికారులకు,స్టేషన్ రైటర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ మాట్లాడుతూ.. ఆధునిక శాస్త్రీయ విధానాల ద్వారా నేరాలను సమర్ధవంతంగా పరిష్కరించేందుకు పోలీస్ శాఖ మరింత ప్రావీణ్యంతో ముందుకు సాగుతోందని,నేర పరిశోధనలో ఆధునిక సాంకేతికత ఉపయోగం పెరుగుతున్న నేపథ్యంలో,కేసుల విచారణలో ఆధారాలను సైన్స్ పరంగా విశ్లేషించడానికి ఫోరెన్సిక్ శిక్షణ ఎంతో అవసరమన్నారు.ఇలాంటి శిక్షణల ద్వారా కేసుల విచారణలో మరింత నిష్ణాతులుగా తయారయ్యేలా పోలీస్ అధికారులకు,సిబ్బందికి దోహదపడతాయన్నారు.హత్యలు,




ఆత్మహత్యలు, దొంగతనాలు మొదలగు నేర సంఘటనలో ఆధారాలు ఏ విధంగా సేకరించాలి, ఏ ఏ ఆధారాలు సేకరించాలి,ఏ విధంగా భద్రపరచాలి,ఫోరెన్సిక్ ల్యాబరేటరికి ఎం ఎం పంపించాలనె అంశాలపై ఇన్వెస్టిగేషన్ అధికారులకు,స్టేషన్ రైటర్లకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఫోరెన్సిక్ సైన్స్ పై అవగాహన కల్పించిన మెడికల్ కళశాల వైద్య బృందాన్ని అభినందించి మెమోంటోస్ జిల్లా ఎస్పీ అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. రాజేశ్వరి, వైస్ ప్రెసిపల్ డా. లక్ష్మీ నారాయణ,డా. నిర్విష హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఫోరెన్సిక్ మెడిసిన్, డా. వినేయ్ మరియు కళాశాల ప్రొఫెసర్లు,డాక్టర్లు,సి.ఐ లు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, ఆర్.ఐ లు యాదగిరి, మధుకర్, ఎస్.ఐ లు అన్ని పోలీస్ స్టేషన్ల రైటర్స్ పాల్గొన్నారు.

## మంత్రి ప్రసంగాన్ని అడ్డుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ

రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రసంగిస్తుండగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అడ్డుకోవడంతో ఓపెన్ సభలో గందరగోళ పరిస్థితి చోటుచేసుకుంది. ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన బంజారాహిల్స్‌లోని బంజారా భవన్ వేదికగా ఈ ఘటన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "గత తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ ప్రభుత్వ కాలంలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా మంజూరు కాలేదు" అని విమర్శలు గుప్పించారు. ?? స్పందించిన ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. "కేసీఆర్ పాలనలో 6 లక్షల కొత్త కార్డులు మంజూరయ్యాయి" అని ప్రతిఉత్తరంగా వెల్లడించారు.

## భూపాలపల్లికి బైపాస్ రోడ్డుకు కేంద్ర అనుమతి

- **రూ.250 కోట్లు వ్యయంతో బైపాస్ రోడ్ నిర్మాణం - డీపీఆర్ సిద్ధం చేయాలని సూచన**
- **576 రోడ్డుప్రమాదాలు, 233 మంది మృతులు.. కేంద్రానికి ఎంపీ కావ్య నివేదిక**

**బలగం టీవీ, హైదరాబాద్**

భూపాలపల్లి పట్టణంలోని తీవ్రమైన ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య చేపట్టిన అనేక వినతులకు కేంద్ర రోడ్లు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీ ప్రతిస్పందించారు. 2025%-%26 వార్షిక ప్రణాళికలో ఈ బైపాస్ రోడ్డు కోసం అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.

ఎన్‌హెచ్-353సీ మీదుగా సాగుతున్న బొగ్గు రవాణా, పవర్ ప్లాంట్ కార్యకలాపాలు, భారీ వాహనాల రాకతో భూపాలపల్లి పట్టణమధ్యగా దట్టమైన ట్రాఫిక్ జరిగుతోంది. ఈ కారణంగా గత మూడు సంవత్సరాల్లో 576 రోడ్డుప్రమాదాలు చోటుచేసుకోగా, 233 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రికి ఎంపీ కావ్య స్పష్టంగా వివరించారు.

**రూ.250 కోట్ల వ్యయంతో నిర్మాణం**

ఈ బైపాస్ రోడ్డు నిర్మాణానికి మొత్తం రూ.250 కోట్ల అంచనా వ్యయం ఉండగా, అందులో రూ.175 కోట్లు నిర్మాణానికి, రూ.75 కోట్లు భూసేకరణకు వినియోగించాలని ఎంపీ కోరారు. ఈ ప్రతిపాదనలన్నీ 2025-26 వార్షిక ప్రణాళికలో చేర్చాలని డా. కడియం కావ్య విజ్ఞప్తి చేశారు.

**డీపీఆర్ సిద్ధం- టెండర్ ప్రక్రియ త్వరలో**

ఎంపీ వినతిని సానుకూలంగా పరిశీలించిన కేంద్ర మంత్రి గడ్కరీ స్పందిస్తూ, త్వరలోగా డీపీఆర్ (వివరాల ప్రాజెక్టు నివేదిక) సిద్ధం చేసి, టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామని లేఖ ద్వారా హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ "భూపాలపల్లి పట్టణ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న ట్రాఫిక్ భారాన్ని తొలగించే దిశగా ఇది చాలా కీలకమైన అడుగు. బైపాస్ రోడ్డు ద్వారా ప్రజలకు భద్రత పెరగడం తోపాటు, ప్రయాణ సమయాన్ని తగ్గించుకోవచ్చు" అని పేర్కొన్నారు.

## నలుగురు దొంగల ముఠా అరెస్ట్..

- సిరిసిల్ల టౌన్ పి.ఎస్. పరిధిలో రెండు కేసులు నమోదు, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి
- ఇన్స్పెక్టర్ కె. కృష్ణ



**బలగం టీవీ, సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా, సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇళ్లలో జరిగిన దొంగతనాలకు సంబంధించి నలుగురు దొంగల ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కె. కృష్ణ తెలిపారు. వీరిపై సిరిసిల్ల పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కేసులు నమోదయ్యాయని ఆయన వెల్లడించారు. దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు మరింత అప్రమత్తతతో విధులు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కె. కృష్ణ మాట్లాడుతూ, అరెస్ట్ చేసిన నిందితుల నుండి దొంగిలించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటిలో 18 గ్రాముల బంగారు గాజు, 2 గ్రాముల బరువు గల ఒక జత చెవుల కమ్మలు, 1.1 గ్రాముల చిన్న బంగారు రింగు, 15.450 గ్రాముల డిజైన్ రోల్ గోల్డ్ గాజు, 15.700 గ్రాముల డిజైన్ రోల్ గోల్డ్ గాజు, 12.130 గ్రాముల నార్మల్ రోల్ గోల్డ్ గాజు, 1.720 గ్రాముల చిన్న రోల్ గోల్డ్ రింగు ఉన్నాయని వివరించారు.




## పొగాకు వాడొద్దు..

### పొగాకు రహిత పాఠశాలలకు సిద్దిపేట విద్యార్థుల ర్యాలీ

**బలగం టీవీ, సిద్దిపేట**

పొగాకు రహిత సమాజం కోసం సిద్దిపేట విద్యార్థులు తమ వంతు కృషి చేస్తున్నారు. 'టొబాక్కో ఫ్రీ స్కూల్ ఛాలెంజ్'లో భాగంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సెలెస్టియల్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పొగ పీల్చరాదని.. పొగాకు ఉత్పత్తులతో ఆరోగ్యానికి హాని అంటూ నినాదాలు చేశారు. పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలపై నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ర్యాలీకి ముందు పాఠశాలలో పొగాకు వ్యసనంపై నాటక పోటీలు, వ్యాసరచన పోటీలు, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు వై. హన్మంతరెడ్డి, బి. శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె. విక్రమ్‌రెడ్డి సంతోషంగా పాల్గొన్నారు.



## కేటీఆర్ సేన ఆధ్వర్యంలో హైమాస్ లైట్ల ఏర్పాటు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాళ్ళపేట గాంధీనగర్‌లోని ప్రజలకు వెలుగులు ప్రసాదిస్తూ కేటీఆర్ సేన ఆధ్వర్యంలో హైమాస్ లైట్లు ఏర్పాటు చేయబడ్డాయి. గత జూలై 24న, కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమానికి వచ్చిన భాస్కర్ గౌడ్‌కు గ్రామస్తులు తమ సమస్యలను విన్నవించారు. హైమాస్ లైట్లు లేకపోవడంతో చీకటిలో ఇబ్బందులు పడుతున్నామని వారు తెలియజేశారు.

గ్రామస్తుల వినతిని స్వీకరించిన భాస్కర్ గౌడ్, వెంటనే లైట్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, గాంధీనగర్‌లో హైమాస్ లైట్లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కేటీఆర్ సేన నాయకులు మాట్లాడుతూ కేటీఆర్ సేన గ్రామగ్రామాన బలోపేతం అవుతుందని, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తౌటి శివ, మామిడాల విజయ్, బండి ప్రశాంత్, అమరగొండ కృష్ణ, బండి కృష్ణ బాబు, ఎండీ ఇమామ్, షాదుల, గఫూర్ మరియు గ్రామ యువత పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం..

- 18 సంవత్సరాలలోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారితో పని చేయిస్తున్న వారిపై 14 కేసులు నమోదు..
- జిల్లాలో 97 మంది బాలబాలికల సంరక్షణ..
- సిడబ్ల్యూసి ముందు హాజరుపర్చి బాలబాలికల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి అప్పగించడం జరిగింది..
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతంగా పూర్తయింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా 97 మంది బాలబాలికలను గుర్తించి వారికి సంరక్షణ కల్పించారు. బాలకార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తున్న 14 మందిపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ తెలిపారు.



జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంవత్సరంలో రెండుసార్లు ఆపరేషన్ స్మైల్ మరియు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. తప్పిపోయిన బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. ఈ ఏడాది జులై 1 నుండి 31 వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతంగా నిర్వహించబడిందని ఎస్పీ వెల్లడించారు.

ఈ ఆపరేషన్ కోసం పోలీస్ శాఖ, చైల్డ్ వెల్ఫేర్, లేబర్ డిపార్ట్‌మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ, హెల్త్ డిపార్ట్‌మెంట్ వంటి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, అలాగే ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో 97 మంది బాలబాలికలను గుర్తించి, వారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచారు. సీడబ్ల్యూసీ అధికారులు బాలల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం వారిని తల్లిదండ్రులకు అప్పగించడం జరిగింది. ముఖ్యంగా, 18 సంవత్సరాలలోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారితో పని చేయిస్తున్న వారిపై 14 కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్పీ గితే స్పష్టం చేశారు.

బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చేయాలని ఎస్పీ ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు. తరచుగా బాలలతో పనులు చేయిస్తున్న వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీధి బాలలను చూసినప్పుడు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతానికి సహకరించిన అన్ని శాఖల అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రత్యేకంగా అభినందించారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్మెంట్ లో పైరవీలు ..?

- జూనియర్ లను వదిలి సీనియర్ లకు బదిలీ...!
- మండలంలోనే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న స్కూల్ ఇల్లంతకుంట జడ్పీ హెచ్ఎస్..

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్,221 మంది విద్యార్థులు వున్న పాఠశాలో సాంఘికశాస్త్రం బోదిస్తున్న చిప్ప పుష్పలత ను శుక్రవారం రోజు వర్క్ అడ్జస్ట్మెంట్ లో భాగంగా జిల్లా విద్యాశాఖ అనంతగిరి జడ్పీహెచ్ఎస్ పాఠశాల కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.కాని విచిత్రం ఏంటంటే అదే మండలం లోని గాలిపల్లి జడ్పీహెచ్ఎస్ 150 మంది విద్యార్థులు కు సోషల్ బోధిస్తున్న రెండు సోషల్ పోస్టుల్లో ఒకరైన జూనియర్ ఉపాధ్యాయుడు అయిన కొమురయ్య,కందికట్కూర్ జడ్పీహెచ్ఎస్ లో కూడా 88 మంది విద్యార్థులకు గాను ఇద్దరు ఉపాధ్యాయులు సోషల్ బోదిస్తున్నారు.ఈ ఇద్దరి లో ఒకరైన ఓ వ్యక్తి చిప్ప పుష్పలత కంటే జూనియర్స్ అయినప్పటికీ కూడా వారిని బదిలీ చేయకుండా,సీనియర్ ఉపాధ్యాయురాలైన చిప్ప పుష్పలత ను బదిలీ చేయటం వెనుక జిల్లా విద్యాశాఖ,కలెక్టరేట్ లలో పైరవీలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి.

వర్క్ అడ్జస్ట్మెంట్ లో సీనియర్స్ ను వదిలి జూనియర్స్ ను మాత్రమే బదిలీ చేయాలి అని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికి కూడా అవేమి పట్టకుండా బదిలీ చేయటం దారుణం అని అంటున్నారు. ఇంకా ముఖ్య విషయం అసలు ఇల్లంతకుంట జడ్పహెచ్ ఎస్ పాఠశాలలో 221 మంది విద్యార్థులు మండలంలో ఎక్కువ విద్యార్థులు ఉన్న స్కూల్ అయినప్పటికీ కూడా ఇక్కడి నుండి బదిలీ చేయటం దారుణం అని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి తప్పుడు బదిలీలను నిలిపివేసి,న్యాయపరంగా సీనియర్స్,జూనియర్స్ ను పరిగణలోకి తీసుకుంటూ బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి

## రౌడీషీటర్ మనోజ్‌పై పీడీ యాక్ట్ నమోదు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

భూ వివాదానికి సంబంధించి ఓ మహిళను హత్య చేసిన కేసులో నిందితుడైన రౌడీషీటర్ బొల్లు మనోజ్ (20) పై పీడీ యాక్ట్ (ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్) నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం చందుర్తి సీఐ ఆధ్వర్యంలో మనోజ్‌కు పీడీ యాక్ట్ నిర్బంధ ఉత్తర్వులను అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారు. చందుర్తి మండలానికి చెందిన బొల్లు మనోజ్ గతంలో 2023లో హత్య కేసుతో పాటు దొంగతనం, బెదిరింపులకు పాల్పడిన కేసులలో నిందితుడిగా ఉన్నాడు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న మనోజ్‌పై 2024 సంవత్సరంలో రౌడీషీట్ తెరిచారు. పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించినప్పటికీ అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రానందున, తరచు నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నందున జిల్లా కలెక్టర్ పీడీ యాక్ట్ అమలు చేయడానికి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు మనోజ్‌ను అదుపులోకి తీసుకుని చర్లపల్లి జైలుకు పంపారు.




## సీఎం రేవంత్ రెడ్డి ఫోటోతో అటెండెన్స్..!

- పంచాయతీ కార్యదర్శి నిర్వాకంపై అధికారులు షాక్!
- జగిత్యాల జిల్లాలో వెలుగుచూసిన ఫేషియల్ రికగ్నిషన్ యాప్ దుర్వినియోగం..
- ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో రేవంత్ రెడ్డి ఫోటోతో అటెండెన్స్ వేసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగి
- విధులకు హాజరు కాకుండా యాప్‌లో రేవంత్ రెడ్డి ఫోటో అప్లోడ్ చేసిన పంచాయతీ కార్యదర్శి

**బలగం టీవీ, జగిత్యాల**

తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల హాజరును పర్యవేక్షించేందుకు మొబైల్ ఫోన్ ద్వారా ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ యాప్ ద్వారా కార్యదర్శులు తాము విధులు నిర్వహిస్తున్న గ్రామాల నుంచే అటెండెన్స్ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, కొందరు కార్యదర్శులు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. తాజాగా, జగిత్యాల జిల్లాలో జరిగిన తనిఖీల్లో ఒక పంచాయతీ కార్యదర్శి చేసిన నిర్వాకం అధికారులను దిగ్భ్రాంతికి గురిచేసింది.

వివరాల్లోకి వెళ్తే, కొంతమంది పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ ఒకే ఫోటోతో అటెండెన్స్ నమోదు చేస్తుండటంతో అధికారులకు అనుమానం వచ్చింది. దీంతో వారు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో జగిత్యాల జిల్లాకు చెందిన ఒక పంచాయతీ కార్యదర్శి విధులకు హాజరు కాకుండా, ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోను అప్‌లోడ్ చేసి అటెండెన్స్ వేసుకుంటున్నట్లు గుర్తించారు. ఇది చూసి అధికారులు షాకయ్యారు. ఇది ఒక్క జగిత్యాల జిల్లాలోనే కాదు, మరికొందరు పంచాయతీ కార్యదర్శులు కూడా విధులకు వెళ్లకుండా అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిసింది. కొందరు ఇతరుల సహాయంతో తాము లేకుండానే అటెండెన్స్ నమోదు చేసుకోగా, ఇంకొందరు ఖాళీ కుర్చీల ఫోటోలు పెట్టి అటెండెన్స్ నమోదు చేసుకుంటున్నారు.

# జాతీయ అవార్డుల వేదికపై టాలీవుడ్ హవా








- **71వ జాతీయ అవార్డుల్లో ఏకంగా ఏడు అవార్డులు కైవసం**
- **భాగ్యవంతులైన టాలీవుడ్ సినిమాలు, కళాకారులు వీళ్లే..!**

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల వేదికపై ఈసారి టాలీవుడ్ సినిమాలు తన హవాను చూపించింది. అత్యంత ప్రతిభావంతమైన తెలుగు చిత్రాలు, నటులు, సాంకేతిక నిపుణులు తమ తమ విభాగాల్లో అవార్డులు సాధించి తెలుగు సినిమా గొప్పతనాన్ని చాటారు. ఈసారి ఏకంగా ఏడుకు పైగా విభాగాల్లో తెలుగు సినిమా జాతీయ అవార్డులు సాధించగా టాలీవుడ్ గర్వించదగ్గ ఈ అవార్డుల వివరాలు ఇలా ఉన్నాయి:

**ఉత్తమ తెలుగు చిత్రం: భగవంత్ కేసరి**

నందమూరి బాలకృష్ణ, శ్రీలీల నటించిన "భగవంత్ కేసరి" సినిమా ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపికైంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో, షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై రూపొందిన ఈ చిత్రం 2023లో విడుదలై ఘనవిజయం సాధించింది. జైలు ఖైదీగా బాలకృష్ణ పోషించిన పాత్ర, ఆర్మీ డ్రీమ్ ఉన్న యువతిని ఆదుకునే ఇతివృత్తంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.

**ఉత్తమ యాక్షన్ డైరెక్షన్ మరియు ఉత్తమ యానిమేషన్/విజువల్ ఎఫెక్ట్స్/కామిక్ విభాగం: హను-మాన్**

తేజా సజ్జ హీరోగా, ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందిన హను-మాన్ సినిమాకు ఒకేసారి రెండు జాతీయ అవార్డులు వరించాయి. భారతదేశపు తొలి సూపర్ హీరో సినిమా హను-మాన్ కు ఉత్తమ యాక్షన్ కొరియోగ్రఫీతో పాటు, విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్ విభాగాల్లో అత్యుత్తమంగా నిలిచినందుకు ప్రత్యేక అవార్డు లభించింది.

**ఉత్తమ గాయకుడు: రోహిత్ విపిఎస్ఎన్ ('ప్రేమిస్తున్నా' పాట - బేబీ)**

చిన్న సినిమాగా ప్రారంభమై సంచలనం సృష్టించిన బేబీ సినిమాలోని "ప్రేమిస్తున్నా" పాటకు గాయనుడు రోహిత్ విపిఎస్ఎన్‌కు ఉత్తమ గాయకుడిగా అవార్డు లభించింది. బ్రేకప్ థీమ్ నేపథ్యంలో ఈ పాట వినిపించే ఎమోషన్ దేశవ్యాప్తంగా స్పందన తెచ్చింది.

**ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత: సాయి రాజేష్ (బేబీ)**

దేవరకొండ ఆనంద్, వైష్ణవి చైతన్య, విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రలుగా వచ్చిన బేబీ సినిమాకు కథ, కథనం పరంగా ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. దీనికి దర్శకుడు సాయి రాజేష్ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా అవార్డు పొందారు.

**ఉత్తమ గీత రచయిత: కాసర్ల శ్యామ్ ('ఊరు పల్లెటూరు' పాట - బలగం)**

తెలుగు గ్రామీణతను ప్రతిబింబిస్తూ గ్రామీణ ప్రజల భావాలను స్పష్టంగా ఆవిష్కరించిన బలగం సినిమాలోని "ఊరు పల్లెటూరు" పాటకు కాసర్ల శ్యామ్ ఉత్తమ గీత రచయితగా అవార్డు అందుకున్నారు.

**ఉత్తమ బాలనటి: సుకృతి వేణి బండ్రెడ్డి (గాంధీ తాత చెట్టు)**

దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి వేణి 'గాంధీ తాత చెట్టు' సినిమాలో బాలనటిగా నటించి ప్రేక్షకులను మెప్పించడంతో ఆమెకు ఉత్తమ బాలనటి అవార్డు లభించింది.










## ఆకాష్ దీప్‌పై దినేశ్ కార్తీక్ ఆగ్రహం

**బలగం టీవీ, ఓవల్**

ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదో టెస్ట్‌లో టీమిండియా యువ పేసర్ ఆకాష్ దీప్ తీరుపై మాజీ క్రికెటర్, కామెంటేటర్ దినేశ్ కార్తీక్ తీవ్రంగా స్పందించారు. ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్‌ను ఔట్ చేసిన అనంతరం ఆకాష్ దీప్ అతని భుజాలపై చేతులు వేసి, ఏదో చెబుతూ సెండాఫ్ ఇవ్వడంతో వివాదాస్పదంగా మారింది. డకెట్ మాత్రం దీన్ని సహనంగా భరించి మౌనంగా మైదానం వీడాడు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. ఆకాష్ దీప్ ప్రవర్తనను గమనించిన కేఎల్ రాహుల్ వెంటనే అతని చేతిని డకెట్‌పై నుంచి తొలగించారు. ఈ ఘటనపై కామెంటేటర్‌గా ఉన్న దినేశ్ కార్తీక్ స్పందిస్తూ "ఒక బ్యాటర్ ఔటైనా, ఇలా వ్యవహరించడం సరికాదు. ఇది అనవసరమైన ఎమోషన్. బెన్ డకెట్ స్పందించిన తీరే నిజమైన ఉదాత్తత. అందరూ ఆయనలాగా ఉండలేరు" అని హితవు పలికారు. ఇదే విషయంపై ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ అథర్టన్ కూడా స్పందిస్తూ.. "ఇది అనవసరం, అసహనపూరితంగా ఉంది" అని అభిప్రాయపడ్డారు.


ఈ మ్యాచ్‌లో డకెట్ దూకుడుగా ఆడుతూ భారత బౌలర్లపై బజ్‌బాల్ గేమ్‌తో దాడి ప్రారంభించాడు. స్విచ్ హిట్, రివర్స్ స్వీప్, బౌండరీ షాట్స్‌తో ఆకట్టుకున్న డకెట్ (38 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులతో 48) రివర్స్ స్కూప్ ప్రయత్నంలో వికెట్ కీపర్‌కి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో తొలి వికెట్‌కు వచ్చిన 92 పరుగుల భాగస్వామ్యం విరిగింది.

## 'కింగ్‌డమ్' మొదటి రోజు కాసుల వర్షం

**రూ.39 కోట్ల గ్రాస్ వసూళ్లు**

**సితార ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి స్పెషల్ పోస్టర్ విడుదల**

**బలగం టీవీ, హైదరాబాద్**




విజయ్ దేవరకొండ నటించిన తాజా చిత్రం కింగ్‌డమ్ బుధవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలైన వెంటనే మిక్స్‌డ్ టాక్ వచ్చినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను నమోదు చేసింది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా తొలి రోజే రూ.39 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎక్స్ వేదికగా ఓ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రాన్ని గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించగా, విజయ్ దేవరకొండ సరసన భాగ్యశ్రీ భోర్సే కథానాయికగా నటించారు. యువ నటుడు సత్యదేవ్, మలయాళ నటుడు వెంకిటేశ్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించగా, సంగీతాన్ని యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ అందించాడు. విజయ్ దేవరకొండ క్రేజ్, అనిరుధ్ మ్యూజిక్, గౌతమ్ తిన్ననూరి దర్శకత్వ నైపుణ్యం కలగలిసిన ఈ చిత్రం అభిమానులను ఎంతవరకూ ఆకట్టుకుందన్నది వారం చివర్లో స్పష్టమవుతుందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## శివకార్తికేయన్ 'మదరాశి' సెప్టెంబర్ 5న విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




తమిళ యువహీరో శివకార్తికేయన్ నటిస్తున్న తాజా చిత్రం మదరాశి త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. గజిని, తుపాకీ వంటి హిట్ చిత్రాలను అందించిన దిగ్గజ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, శ్రీ లక్ష్మీ మూవీస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇటీవల అమరన్ వంటి బ్లాక్‌బస్టర్‌ను అందించిన శివకార్తికేయన్ నుంచి వస్తున్న ఈ సినిమా పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా ఈ ఏడాది సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. కన్నడ నటి రుక్మిణి కథానాయికగా నటిస్తుండగా, సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. తాజాగా చిత్రం నుంచి మొదటి సింగిల్ సెలవిక కన్నమ్మా అనే పాటను చిత్ర బృందం విడుదల చేసింది. ప్రేమలో విఫలమైనవారి భావోద్వేగాలను ప్రతిబింబించేలా ఈ పాట ఉండనుందని విడుదలైన లిరిక్స్ ద్వారా స్పష్టమవుతోంది. సింగిల్ పాటకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. శివకార్తికేయన్ మురుగదాస్ కలయికలో వస్తున్న ఈ చిత్రం తమిళ సినీ పరిశ్రమతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ ఆసక్తిని రేపుతోంది.

## అరేబియా కడలి వెబ్ సిరీస్

**సత్యదేవ్ హీరోగా.. ఆగస్టు 8 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్**

**బలగం టీవీ, హైదరాబాద్**




అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటించిన 'తండేల్' చిత్రం సంచలన విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌కి చెందిన జాలర్ల కథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. తాజాగా ఇదే నేపథ్యంలో ఒక వెబ్ సిరీస్ రూపంలో 'అరేబియా కడలి' పేరుతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ వెబ్ సిరీస్‌లో నటుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటించగా, దర్శకుడు సూర్యకుమార్ ఈ సిరీస్‌కి దర్శకత్వం వహించారు. ప్రముఖ దర్శకుడు క్రిష్ జగర్లమూడి కథ రచయితగా, అలాగే క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై వై. రాజీవ్ రెడ్డి, జె. సాయిబాబు ఈ సిరీస్‌ను నిర్మిస్తున్నారు.

'అరేబియా కడలి' వెబ్ సిరీస్ ఈ నెల 8న అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. తాజాగా విడుదలైన ట్రైలర్‌కు విశేష స్పందన లభించింది. ట్రైలర్‌లో చూపిన కంటెంట్ 'తండేల్' చిత్రాన్ని తలపించిందని సినీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ సిరీస్‌లో సత్యదేవ్‌తో పాటు ఆనంది, నాసర్, రఘుబాబు, దలీప్ తాహిల్, పూనమ్ బజ్వా, హర్ష రోషన్, నిహార్ పాండ్యా, అమిత్ తివారీ, రవి వర్మ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. 2024లో ప్రారంభమైన ఈ సిరీస్ షుటింగ్ తాజాగా ముగిసింది. ఇదే కథాంశంతో కొన్ని సినిమాలు వచ్చినా.. 'అరేబియా కడలి' కథ పూర్తిగా నూతనంగా, సత్య ఆధారంగా ఉండబోతుందని మేకర్స్ తెలిపారు.

## యూట్యూబ్‌లోకి 'సితారే జమీన్ పర్'

**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ నటించిన తాజా చిత్రం 'సితారే జమీన్ పర్' ఓటీటీ వేదికగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడిన ఈ చిత్రాన్ని తాజాగా యూట్యూబ్ ప్లాట్‌ఫామ్‌లో పే-పర్-వ్యూ మోడల్‌లో విడుదల చేశారు. కేవలం రూ.100కి పూర్తి కుటుంబంతో కలిసి చూడవచ్చని చిత్రబృందం ప్రకటించింది. సాధారణంగా చిత్రాలు థియేటర్ ప్రదర్శన తర్వాత ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ అయిన నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, డిస్నీ హాట్‌స్టార్‌లలో విడుదలవుతుంటాయి. అయితే ఈ సంప్రదాయాన్ని పక్కనపెట్టి, అత్యంత ప్రజాదరణ పొందిన యూట్యూబ్ వేదికగా విడుదల చేయడం వినూత్నంగా నిలిచింది.

## సినీ నటి రాధికకు అస్వస్థత..

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రముఖ సినీ నటి రాధికా శరత్ కుమార్ ఆసుపత్రిలో చేరారు. జ్వరంతో బాధపడుతున్న రాధికను కుటుంబ సభ్యులు గత నెల 28న చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాధికకు డెంగ్యూ సోకినట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయిందని, ఆమెకు చికిత్స అందిస్తున్నామని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం రాధిక ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని పేర్కొన్నాయి. అయితే, ఈ నెల 5 వరకు రాధికకు చికిత్స కొనసాగించాల్సిన అవసరం ఉందని, ఆ తర్వాతే ఆమెను డిశ్చార్జి చేస్తామని వైద్యులు తెలిపారు. అభిమానులు, సహచరులు ఆమె త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ సినిమాలు, సీరియల్స్ లలో నటించి రాధిక మంచి గుర్తింపు పొందారు. నటిగానే కాకుండా విజయవంతమైన టీవీ సీరియల్ నిర్మాతగానూ పేరొందారు. రాధిక రాజకీయాల్లోకి కూడా ఎంట్రీ ఇచ్చారు. తెలుగులో చిరంజీవితో ఆమె దాదాపు 15కు పైగా సినిమాల్లో జంటగా నటించి మెప్పించారు.